సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 4 | మార్చి | 2025



50రోజులు.. 48 బ్రేక్‌డౌన్‌లు

సాంకేతిక సమస్యలు, డ్రైవర్ల అనుభవ రాహిత్యంతో ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. - 8లో ▸



వేసవి పనులు పూర్తిచేయాలి

వేసవి ప్రణాళికలో భాగంగా మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.1° /21.2°

జిల్లాలో ఉదయం వాతావారణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.



న్యూస్‌రీల్

బంగారు ఆభరణాల బహూకరణ



గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవానీ సహిత కోటగుళ్లకు రూ.లక్షా 21వేల విలువైన బంగారు ఆభరణాలు (రెండు గొలుసులు) ఎన్‌ఆర్‌ఐ దంపతులు బహూకరించారు. గణపురం మండలకేంద్రానికి చెందిన అట్లూరి ఉదయలక్ష్మి జగన్‌మోహన్‌రావు కూతురు ఉయ్యూరు శిల్ప చౌదరి–రామకృష్ణ దంపతులు అమెరికాలో ఉంటున్నారు. వారు ఆలయానికి చేపించిన బంగారు ఆభరణాలను వారి తల్లితండ్రులైన ఉదయలక్ష్మి–జగన్‌మోహన్‌రావు దంపతులు సోమవారం ఆలయ అర్చకులు నాగరాజుకు అందించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందచేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



చిట్యాల: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఒడితల గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, బద్ది పోచమ్మ తల్లి దేవాలయాలలో సోమవారం ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. దేవతామూర్తుల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, నాయకులు చిలుకల రాయకొంరు, దబ్బెట అనిల్, కామిడి రత్నాకర్‌రెడ్డి, సాంబలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో సోమవారం డీఎంహెచ్‌ఓ మధుసూదన్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఐదు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషెన్లు, స్పెషల్ డ్రైవ్ పీసీపీఎన్‌డీ కమిటీ సభ్యులు రికార్డులు పరిశీలించారు. గత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గర్భవతుల స్కానింగ్ వివరాలు, ఫామ్–ఎఫ్ రికార్డులు, స్కానింగ్ మిషన్ వివరాలను తనిఖీ చేశారు. స్కానింగ్ కోసం వచ్చిన గర్భవతులకు లింగనిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఉమెన్ తహసీల్దార్ శ్వేత, ఉమెన్ పోలీస్ ఆఫీసర్ శ్రీలత, సఖి కన్సల్‌టెంట్ గాయత్రి, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.

అన్నారం అడవిలోకి పులి

కాటారం: మండలంలోని ప్రతాపగిరి అటవీ ప్రాంతం నుంచి అన్నారం అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం మహదేవపూర్ మండలం ఏన్కపల్లి అటవీ ప్రాంతం నుంచి ప్రతాపగిరి సమీపంలోకి పులి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు పాదముద్రలు(ప్లగ్‌మార్క్స్) గుర్తించారు. గాలింపు చర్యల్లో భాగంగా ఆదివారం పులి ప్రతాపగిరి అటవీ ప్రాంతం నుంచి మర్రివాగు మీదుగా నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు పులి పాదముద్రల ద్వారా నిర్ధారణకు వచ్చారు. నస్తూర్‌పల్లి అడవి నుంచి వీరాపూర్ మీదుగా అన్నారం గుట్ట ప్రాంతంలోకి పులి చేరినట్లు అటవీశాఖ అధికారులు ఆనవాళ్లు గుర్తించారు.

శ్రీపాల్‌కు పట్టం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి గెలుపు

నల్లగొండలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ–టీఎస్ బలపరిచిన అభ్యర్థి, ఉమ్మడి వరంగల్‌కు చెందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై 5,521 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 8,448 ఓట్లు వచ్చాయి. నర్సిరెడ్డి ఎలిమినేట్ కాకముందు గెలుపు కోటా ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి కూడా లేవు. దీంతో నర్సిరెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో.. శ్రీపాల్‌రెడ్డికి వచ్చిన 2,870 రెండో ప్రాధాన్యత ఓట్లు కలిపారు. చివరికి శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించారు.

- రెండో ప్రాధాన్యత ఓట్లతో తేలిన ఫలితం
- సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై 5,521 ఓట్ల మెజారిటీ
- 19మంది బరిలో ఉన్నా ఐదుగురి మధ్యనే సాగిన పోటీ
- అభ్యర్థుల ఎలిమినేషన్ సమయంలో పెరిగిన ఉత్కంఠ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నల్లగొండ ఆర్జాలబావిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో సోమవారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. బండిల్స్ కట్టడం ఉదయం 11 గంటల వరకు కొనసాగింది. ఆ తరువాత ఓట్ల లెక్కింపు చేపట్టారు. సాయంత్రం 3 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయింది. దీంతో అధికారులు మొత్తం చెల్లిన ఓట్లలో సగానికి మించి ఒక్క ఓటును గెలుపు కోటాగా నిర్ణయించారు. మొత్తం 24,135 ఓట్లు పోలవగా 494 ఓట్లు చెల్లలేదు. 23,641 ఓట్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయి. దీంతో గెలుపు కోటాను 11,821గా నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్‌రెడ్డికి అత్యధికంగా 6,035 ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు సరిపడా ఓట్లు రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. చివరికి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతోనే శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు.

రౌండ్ రౌండ్‌కు ఉత్కంఠే..

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. 15వ రౌండ్ నుంచి ఉత్కంఠ మరింతగా పెరిగింది. శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యంలో ఉన్నా ద్వితీయ స్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి చేరువలో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రాగలిగినా సుందర్‌రాజు ఎలిమినేషన్‌తో ఇద్దరి మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ఆ తరువాత పులి సరోత్తంరెడ్డి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిలను ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కించారు. అప్పటికి కూడా గెలుపు కోటా రాకపోవడంతో చివరకు అలుగుబెల్లి నర్సిరెడ్డిని కూడా ఎలిమినేషన్ చేసి ఓట్లు లెక్కించారు. ఆ తర్వాత శ్రీపాల్‌రెడ్డిని గెలిచినట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ఎలిమినేషన్‌లో ఓట్లు పెరిగాయి ఇలా...

మొదటి ప్రాధాన్యతలో ప్రధాన అభ్యర్థులైన పింగిలి శ్రీపాల్‌రెడ్డికి 6,035 ఓట్లు రాగా, అలుగుబెల్లి నర్సిరెడ్డికి 4,820 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి 4,437 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత పూల రవీందర్‌కు 3,115, బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డికి 2,289, సుందర్‌రాజుకు 2,040 ఓట్లు మాత్రమే వచ్చాయి. అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. ఇలా 14వ రౌండ్ వరకు ఎలిమినేషన్ చేస్తూ ఓట్ల లెక్కింపు చేయగా శ్రీపాల్‌రెడ్డికి అప్పటివరకు 6,165 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 4,946 ఓట్లు వచ్చాయి. హర్షవర్ధన్‌రెడ్డికి 4,596 ఓట్లు, పూల రవీందర్‌కు 3,249 ఓట్లు వచ్చాయి. అంటే.. 14వ రౌండ్‌వరకు ఎలిమినేట్ అయిన అభ్యర్థులనుంచి మరో 130 రెండో ప్రాధాన్యత ఓట్లు శ్రీపాల్‌రెడ్డికి లభించాయి. ఈ రౌండ్ తరువాత సుందర్‌రాజును ఎలిమినేట్ చేసి ఓట్ల లెక్కింపు చేపట్టారు.

- 15వ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి ఒక్కసారే 781 ఓట్లు పెరిగాయి. దీంతో ఆయన ఓట్లు 6,916కి చేరుకున్నాయి. రెండోస్థానంలో ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా 5,205 ఓట్లకు చేరుకున్నారు. హర్షవర్ధన్‌రెడ్డి 4,799 ఓట్లకు చేరుకోగా, పూల రవీందర్ 3,617 ఓట్లకు, సరోత్తంరెడ్డి 2,645 ఓట్లకు చేరుకున్నారు. ఈ రౌండ్‌లో అయిదుగురికి ఓట్లు పెరిగినప్పటికీ శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం కొనసాగుతూ వచ్చింది. ఆయన దరిదాపుల్లో మిగతా అభ్యర్థులు ఎవరూ లేరు.
- పులి సరోత్తంరెడ్డి ఎలిమినేషన్ తరువాత చేపట్టిన 16వ రౌండ్‌లోనూ శ్రీపాల్‌రెడ్డికి అదే స్థాయిలో ఓట్లు వచ్చాయి. ఈ రౌండ్‌లో 757 ఓట్లు పెరిగాయి. ఇక రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డి, 5,660 ఓట్లకు చేరుకోగా, హర్షవర్ధన్‌రెడ్డి 5,309 ఓట్లకు, పూల రవీందర్ 3,992 ఓట్లకు చేరుకున్నారు.
- పూల రవీందర్ ఎలిమినేషన్ తరువాత 17వ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి 1,348 ఓట్లు పెరిగి, 9,021 ఓట్లకు చేరుకున్నారు. ఇక రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డి 6,448 ఓట్లకి చేరుకోగా, మూడో స్థానంలో ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి 6,034 ఓట్లకు చేరుకున్నారు.
- హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేషన్ తరువాత 18వ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి 2,078 ఓట్లు పెరిగి, 11,099 ఓట్లకు చేరుకున్నారు. ఇక రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డి 8,448 ఓట్లకు చేరుకున్నారు. బరిలో శ్రీపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి మాత్రమే మిగిలారు. దీంతో నర్సిరెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో శ్రీపాల్ రెడ్డికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ఇందులో వచ్చిన 2,870 ఓట్లు కలుపుకొని శ్రీపాల్‌రెడ్డి 13,969 ఓట్లు సాధించి గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు.



ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించి ధ్రువీకరణ పత్రం అందుకున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

సభ్యుడి నుంచి ఎమ్మెల్సీ దాకా..

విద్యారణ్యపురి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామానికి చెందినవారు. తండ్రి రాంరెడ్డి, తల్లి సరస్వతి. శ్రీపాల్‌రెడ్డి 1996లో ఎస్‌జీటీగా నెక్కొండ మండలం యూపీఎస్ గొల్లపల్లిలో పనిచేశారు. 2003 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌గా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట యూపీఎస్‌లో చేరారు. ప్రస్తుతం గీసుకొండ మండలం శాయంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య సవిత, కుమారుడు లక్ష్మినందు, కుమార్తె శ్రీవైష్ణవి ఉన్నారు.

పీఆర్‌టీయూలో ప్రస్థానం ఇలా..

పీఆర్‌టీయూలో సభ్యుడిగా చేరిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి 2000 సంవత్సరంలో నెక్కొండ మండల జనరల్ సెక్రటరీగా ఆ తరువాత 2002లో నెక్కొండ మండల అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వర్తించారు. 2008నుంచి 2012వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీగా, 2015లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016, 2017లో వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2019లో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రెండోసారి ఎన్నికయ్యాక ఇప్పటివరకు కొనసాగుతున్నారు.

తొమ్మిది సంవత్సరాల సర్వీస్ ఉండగానే..

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీపాల్‌రెడ్డి కొంతకాలం క్రితమే ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండేందుకు పావులు కదిపారు. 9 సంవత్సరాల సర్వీస్‌ను వదులుకొని చివరికి పీఆర్‌టీయూ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచి ఉత్కంఠ పోరులో విజయం సాధించారు. ఆరేళ్ల తరువాత మళ్లీ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని గెలిచినట్లయింది.


శాసనమండలిలో గొంతెత్తుతా..

టీచర్ల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషిచేస్తా. అందుకు శాసనమండలిలో గొంతెత్తుతా. నాపై నమ్మకం ఉంచి గెలిపించిన ఉపాధ్యాయ, అధ్యాపకులకు కృతజ్ఞతలు. ఎన్నికల్లో అహర్నిశలు నా కోసం కృషి చేసిన పీఆర్‌టీయూ బాధ్యులకు, మద్దతు తెలిపి గెలిపించిన తదితరులందరికీ ధన్యవాదాలు. – పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ

రేపటినుంచి ఇంటర్ పరీక్షలు

3,615మంది విద్యార్థులు

- జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు
- ఎగ్జామ్స్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



భూపాలపల్లి అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమై మార్చి 25వ తేదీతో ముగియనున్నాయి. జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసి.. కావాల్సిన ఏర్పాట్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు పూర్తిచేశారు. జిల్లాలో 34 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉండగా ప్రథమ సంవత్సరంలో 1,820, ద్వితీయ సంవత్సరంలో 1,795మంది విద్యార్థులు.. మొత్తంగా 3,615మంది విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ జూనియర్, ఆరు మోడల్ జూనియర్ కళాశాలలు, నాలుగు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, రెండు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, 10 కేజీబీవీ, రెండు సోషల్ వెల్ఫేర్, ఒకటి మైనారిటీ, నాలుగు బీసీ వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి.

సిబ్బంది నియామకం

పరీక్షల నిర్వహణ కోసం 220 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 8 పరీక్ష కేంద్రాల్లో 16 మంది సీఎస్, డీఓలు, మాస్‌కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల వద్ద గొడవలు జరగకుండా, జనసందోహం లేకుండా చూసేందుకు పోలీసు సిబ్బందిని కూడా నియమించనున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు..

పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఉదయం, మధ్యాహ్నం ఐదు రూట్లలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. బొర్లగూడెం, ఆజాంనగర్ నుంచి భూపాలపల్లికి, గంగారం నుంచి తాడిచెర్ల వరకు, కృష్ణారావుపేట, సర్వాయిపేట నుంచి మహదేవపూర్ వరకు వేర్వేరుగా, దామెరకుంట నుంచి వేర్వేరుగా కాటారం వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు సర్వీసులను సిద్ధంచేశారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. 80088 78060 ఫోన్ నంబర్‌కు ఫోన్‌చేసి విద్యార్థులకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలివే..

- భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల
- తేజస్విని గాంధీ జూనియర్ కళాశాల, భూపాలపల్లి
- కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాల
- కాటారం మోడల్ జూనియర్ కళాశాల
- చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల
- చిట్యాల మోడల్ జూనియర్ కళాశాల
- మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల
- మల్హర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

పకడ్బందీ చర్యలు..



జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షల్లో మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహించవద్దని సీఎస్, డీఓ, సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. విద్యార్థులు పరీక్షల నిబంధనల ప్రకారం హాజరుకావాలి. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షకు హాజరుకావాలి. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం ఉత్తమం.

– వెంకన్న, ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి

లోకల్ సీరియల్ దందా!

సోమవారం ఉదయం కుదురుపల్లి వద్ద ట్రాఫిక్ జాం



క్వారీ వద్ద సీరియల్ ఇప్పించి రూ.వెయ్యి వసూలు

- క్వారీలకు పార్కింగ్ స్థలాలు కరువు
- కుదురుపల్లి, కాళేశ్వరం, మద్దులపల్లి వద్ద ట్రాఫిక్ జాం

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఆదాయంపై దృష్టిసారించడంతో ఇబ్బడిముబ్బడిగా ఇసుక లారీలు క్వారీలకు తరలి వస్తున్నాయి. దీంతో లోకల్ నాయకులు, లారీ ఓనర్లు ముందు సీరియల్ ఇప్పించి రూ.వెయ్యి వసూలుకు తెరలేపారు. నెల రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికలతో మైనింగ్, రెవెన్యూ, పోలీసులు క్వారీల వద్దనే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో అదనపు బకెట్‌దందా తగ్గుముఖం పట్టడంతో లోకల్ నాయకులు సీరియల్ ఇప్పించే కొత్త దందాతో వసూళ్ల పర్వం మొదలుపెట్టారు. దీనిపై మహదేవపూర్ సర్కిల్ పోలీసులు దృష్టిసారించి సోమవారం 15 లారీలపై కేసులు నమోదుచేశారు.

10వేల క్యూబిక్ మీటర్ల క్వాంటిటీతో..

ఇదివరకు 3వేల నుంచి 4వేల క్యూబిక్ మీటర్ల క్వాంటిటీని ఆన్‌లైన్‌లో పెట్టేవారు. స్టాక్‌యార్డుల్లో ఇసుక నిల్వలు ఉండడంతో నెలరోజులుగా రోజుకు 10–12వేలకు పైగా క్యూబిక్ మీటర్ల క్వాంటిటీని మండలంలోని పలు క్వారీల్లో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని లారీలు ఇసుక తరలింపునకు వస్తున్నాయి. దీంతో బొమ్మాపూర్, ఎలికేశ్వరం, మద్దులపల్లి–7, పూస్కుపల్లి 1, 2 క్వారీల వద్ద లారీలు రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలపడంతో తరచూ ట్రాఫిక్‌జాం అవుతోంది.

ఎల్‌ఎన్‌టీ రోడ్డులో వెళ్లాలి..

వివిధ పట్టణాల గుండా వచ్చే లారీలన్నీ టీజీఎండీసీ, పోలీసుశాఖ సూచించిన మార్గం గుండా క్వారీలకు వెళ్లాలి. ఎలికేశ్వరం, బొమ్మాపూర్ క్వారీలకు వెళ్లాల్సిన లారీలు మహదేవపూర్ నుంచి కుదురుపల్లి మీదుగా ఎల్‌ఎన్‌టీ రోడ్డు గుండా వెళ్లాలి. కానీ కొంత మంది లోకల్ నాయకులు, లారీ ఓనర్లు కలిసి వేయి రూపాయలు తీసుకొని మహదేవపూర్ కాలేజీ క్రాస్‌రోడ్డు గుండా బ్రాహ్మణపల్లి, బొమ్మాపూర్ మీదుగా క్వారీల్లోకి పంపిస్తూ ముందు సీరియల్ ఇప్పిస్తున్నారు. కాళేశ్వరం, పూస్కుపల్లి, మద్దులపల్లి వద్ద కూడా ఇదే దందా సాగుతోంది. వారం రోజులుగా సాగుతోంది.

సీరియల్ రాక రోడ్డుపైనే తిష్ట..

వివిధ పట్టణాల నుంచి తరలివచ్చి రెండు మూడు రోజుల పాటు నిరీక్షిస్తున్న లారీ డ్రైవర్లు చేసేదేమీ లేక రోడ్లపై లారీలు నిలిపి సీరియల్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని చేసిన ఆదేశాలను టీజీఎండీసీ, కాంట్రాక్టర్లు బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ట్రాఫిక్‌జాం..

కుదురుపల్లి వద్దకు సోమవారం భారీగా ఇసుక లారీలు తరలిరావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌జాం ఏర్పడింది. దీంతో టీజీఎండీసీ, పోలీసులు తరువాత చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నిత్యం లారీలతో రెండు వరుసల్లో ట్రాఫిక్ జాం అవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

నిర్దేశించిన మార్గంలో వెళ్లాలి..

ఎక్కువగా క్వాంటిటీ పెడుతుండడంతో ఇసుక క్వారీలకు లారీలు భారీగా తరలి వస్తున్నాయి. ఈ క్రమంలో ముందు సీరియల్ ఇప్పిస్తామని కొంతమంది తిరుగుతున్నట్లు తెలిసింది. తాము నిర్దేశించిన మార్గం కాకుండా కాళేశ్వరం, మహదేవపూర్‌లో రాంగ్‌రూట్‌లో వెళ్లిన 15 లారీలపై కేసు నమోదు చేశాం. నిర్దేశించిన మార్గం కాకుండా ఇతర మార్గాల నుంచి వెళ్తే చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌జాం కాకుండా టీజీఎండీసీ పీఓకు తెలిపాం. చర్యలు తీసుకుంటున్నారు.

– రామచంద్రరావు, సీఐ, మహదేవపూర్

ఇసుక అక్రమ రవాణాపై పర్యవేక్షణ

కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద ఇసుక లభ్యత, అనుమతుల కోసం ప్రతిపాదనలు ఇవ్వడం, నూతన రీచ్‌ల ఏర్పాటు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ అవసరమన్నారు. అనుమతులు లేని ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, నిరంతరం తనిఖీలు జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా జరిగే ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో ఉన్న ఇసుక లభ్యతపై ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, మైనింగ్ ఏడీ జయరాజు, టీజీఎండీసీ పీఓ శ్రీకాంత్, డీపీఓ నారాయణరావు, ఇరిగేషన్ ఈఈలు పరశురాం, యాదగిరి, తిరుపతి, ఆర్డీఓ రవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి

రానున్న పది రోజులు పంటలకు సాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీఎస్ సోమవారం కలెక్టర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అధికారులు విజయలక్ష్మి, మల్హార్, తిరుపతి, యాదగిరి, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పది..

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

గణపురం: సమాజంలో అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని.. మంచి సమాజ స్థాపనకు వారి పాత్ర చెప్పలేనిదని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. గణపురం మండలం చెల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లాలోని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల మూడు రోజుల ఇండక్షన్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మంచి సమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. నవసమాజ నిర్మాణంలో విద్యార్థులను భావిత రాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, క్వాలిటీ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోలీ పండుగకు ఆరు ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హోలీ పండుగ సందర్భంగా కాజీపేట జంక్షన్ మీదుగా చర్లపల్లి–హజ్రత్‌నిజాముద్దీన్ మధ్య అప్ అండ్ డౌన్ మార్గంలో ఆరు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు. మార్చి 6,12, 16వ తేదీల్లో చర్లపల్లి–హజ్రత్‌నిజాముద్దీన్ (07707) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు 22.45 గంటలకు చేరుతుంది. అదేవిధంగా తిరుగుప్రయాణంలో మార్చి 8,14,18వ తేదీల్లో హజ్రత్ నిజాముద్దీన్–చర్లపల్లి (07708) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు మరుసటి రోజు 07.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, అండ్ జనరల్ కోచ్‌లతో ప్రయాణించే ఈ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లకు కాజీపేట, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్, నాగ్‌పూర్, రాణి కమలాపతి, బీనా, ఝాన్సీ, ఆగ్రా, పల్వాల్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు శ్రీధర్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు కేయూ మహిళా జట్టు




కేయూ క్యాంపస్ : తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో కొనసాగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టు పాల్గొంటుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య సోమవారం తెలిపారు. ఈజట్టులో ఎస్.భాగ్యశ్రీ, బి.శాంత, ఆర్.రేష్మ, బి.రమ్య (యూపీపీఈ కేయూ వరంగల్), బి.కావ్య, ఎం.త్రివేణి (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ వరంగల్ వెస్ట్), బి. మీనాక్షి, బి.నందిని(టీజీడబ్ల్యూఆర్‌డీసీ, కొత్తగూడెం), ఎం.కరీనా (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఆసిఫాబాద్), ఎస్.నందిని ప్రభుత్వ (ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్, ఖమ్మం), ఎస్.శివాని (యూసీఈటీడబ్ల్యూ, కేయూ), టి.స్నేహ, ఎ.శ్రీలేఖ, టి.నాన్సీ (వీసీపీఈ బొల్లికుంట), కె.సింధూజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ ఉట్నూరు), సీహెచ్ సునీత (యూసీపీఈ, ఖమ్మం) ఉన్నారు. వీరికి హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల పీడీ కె.మధుకర్ కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య పేర్కొన్నారు.

50 రోజులు.. 48 బ్రేక్ డౌన్‌లు

తరచూ ఈ-బస్సుల మొరాయింపు

- కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు
- వరంగల్ రీజియన్‌కు 112 బస్సుల కేటాయింపు
- నిత్యం బ్రేక్ డౌన్లతో ప్రయాణికుల అసహనం





హన్మకొండ: సాంకేతిక సమస్యలు, డ్రైవర్ల అనుభవ రాహిత్యంతో ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. వరంగల్ రీజియన్ పరిధిలో జనవరినుంచి ప్రారంభమైన ఈ సర్వీసులు సుమారు 50 రోజుల్లో ఇప్పటివరకు 48 బ్రేక్ డౌన్‌లు అయ్యాయి. ఇందులో మూడు స్వల్ప ప్రమాదాలు కాగా, మిగతా బ్రేక్ డౌన్‌లన్నీ సాంకేతిక సమస్యలతో రోడ్లపైనే నిలిచిపోయాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి ఈ – బస్ సేవా స్కీమ్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థకు పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్ (పీపీపీ) పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్‌లు కేటాయించింది. ఆర్టీసీ యాజమాన్యం వరంగల్ రీజియన్‌కు 112 బస్సులు కేటాయించగా, వీటిని వరంగల్–2 డిపో ద్వారా నడుపుతున్నారు. ఈ బస్సుల సరఫరా, నిర్వహణను జేబీఎం ఆటో లిమిటెడ్ అనుబంధ సంస్థ జేబీఎం ఎకోలైఫ్ మొబిలిటీ ప్రైవేటు లిమిటెడ్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు డిపో ఆవరణలో ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ముందుగా 82 ఎలక్ట్రిక్ బస్సులు చేరుకోగా జనవరి 6న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభించారు. మిగతావి తర్వాత వచ్చాయి. వీటిని హనుమకొండనుంచి హైదరాబాద్, నిజామాబాద్, ఏటూరు నాగారం, సూర్యాపేట రూట్లలో నడుపుతున్నారు.

సాంకేతికతపై కొరవడిన అవగాహన..

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కొత్తది కావడంతోపాటు తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతీ దానికి సెన్సార్‌లు ఉంటాయి. చిన్నపాటి తేడా వచ్చినా బస్ కదలడం లేదు. సాంకేతికతపై డ్రైవర్లకు అనుభవం లేకపోవడం వల్ల అదనపు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బస్సులు మొరాయించిన సందర్భంలో ప్రయాణికులు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారిని ఇతర బస్సుల్లో చేరవేస్తున్నా ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. కూర్చునేందుకు సీట్లు అందుబాటులో లేకపోవడంతో నిలబడాల్సి రావడంతో అవస్థలు పడుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల మరమ్మతులపై అనుభవం లేకపోవడంతో కంపెనీ ప్రతినిధులపై ఆధారపడాల్సి వస్తోంది. కంపెనీ నుంచి మెకానిక్ వచ్చి బాగు చేయడానికి రెండు రోజుల సమయం పడుతోంది. దీంతో బ్రేక్ డౌన్ అయిన బస్ తిరిగి రోడ్డుపై పరుగెత్తడానికి రెండు రోజుల సమయం పడుతోంది. బస్సులు ప్రారంభించిన 50 రోజుల్లో 48 బ్రేక్‌డౌన్‌లు కావడం చూస్తే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అనుభవరాహిత్యం, సాంకేతిక సమస్యలు..

ఎలక్ట్రిక్ బస్సులు నడపడంలో డ్రైవర్లకు అనుభవరాహిత్యం, సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. సమస్య తలెత్తగానే జేబీఎం సంస్థ స్పందించి వెంటనే మరమ్మతులు చేస్తోంది. ప్రారంభంలో బ్రేక్ డౌన్‌లు ఎక్కువగా ఉండగా, ఇప్పుడు చాలా తగ్గాయి. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కాకుండా వెంటనే మరో బస్సు ఏర్పాటు చేసి తరలిస్తున్నాం.

– డి.విజయ భాను,ఆర్‌ఎం వరంగల్

ఎమ్మెల్సీ రేసులో సీపీఐ నేతలు?



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో సీపీఐ నాయకులు

- టీపీసీసీ చీఫ్‌ను కలిసిన కమ్యూనిస్టులు.. నేడు సీఎంను కలవనున్న బృందం
- రెండు విడతల్లో రెండు సీట్ల ప్రతిపాదన
- పరిశీలనలో వరంగల్, మునుగోడు నాయకులు
- వరంగల్ నుంచి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేరు

సాక్షిప్రతినిధి, వరంగల్ : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటుపై సీపీఐ నేతలు కన్నేశారు. ఈ ఎన్నికలకు గత నెల 24న షెడ్యూల్, సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషన్ విడుదలైన రోజే సీపీఐ జాతీయ, రాష్ట్ర నేతల బృందం టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్ గాంధీభవన్‌లో కలిసింది. నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనుండగా, 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ, 20న పోలింగ్, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే ఎన్నికలు జరిగే ఐదు స్థానాల్లో కాంగ్రెస్‌కు 4, బీఆర్‌ఎస్‌కు 1 ఎమ్మెల్సీ సీటు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, పల్లా వెంకట్‌రెడ్డి, కలవేని శంకర్, ఎం.బాల నర్సింహ, ఈటీ నర్సింహ తదితరుల బృందం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది.

రెండు సీట్ల ప్రతిపాదన..

టీపీసీసీ చీఫ్‌ని కలిసిన సీపీఐ బృందం తమ పార్టీకి రెండు ఎమ్మెల్సీ సీట్లను కేటాయించాలని వినతిపత్రం సమర్పించింది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఒకటి.. ఐదారు మాసాల్లో ఖాళీ అయ్యే స్థానాల్లో మరొకటి ఇవ్వాలని అడిగినట్లు పార్టీ వర్గాల సమాచారం. రెండు సీట్లలో ఒకటి దక్షిణ తెలంగాణ, మరొకటి ఉత్తర తెలంగాణకు ఇవ్వాలన్న ప్రతిపాదన చేసినట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా అవకాశం ఉన్నా సీటు వదులుకున్న మునుగోడు.. ఉద్యమాల చరిత్ర కలిగిన చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కని వరంగల్ నియోజకవర్గాల నాయకుల పేర్లను పార్టీ నేతలు ప్రస్తావించినట్లు తెలిసింది. ఎంపీ ఎన్నికల సమయంలో సైతం వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని అడిగిన సీపీఐ.. కాంగ్రెస్ నాయకత్వం సూచన మేరకు పట్టు వీడింది. ఎమ్మెల్సీ స్థానాల్లోనైనా వరంగల్‌కు చోటు ఇవ్వాలని సీపీఐ నేతలు భావిస్తున్నారు.

ఎమ్మెల్సీ కోసం మొదలైన ప్రయత్నాలు...

అలయెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కోసం సీపీఐలో ప్రయత్నాలు ఎవరికీ వారిగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రధానంగా మునుగోడు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత నెల్లికంటి సత్యంతోపాటు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, వరంగల్‌కు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావుల పేర్లు పార్టీ నాయకత్వం పరిశీలనలో ఉన్నాయి. వీరితో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి కూడా ఎమ్మెల్సీగా తనకే అవకాశం ఇవ్వాలని నాయకత్వానికి కోరినట్లు తెలిసింది. ఏఐఎస్‌ఎఫ్ కార్యకర్త నుంచి ఆలిండియా అధ్యక్షుడిగా.. సీపీఐ ఉమ్మడి వరంగల్‌కు మూడు పర్యాయాలు కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్‌రావు కూడా గట్టిగా పట్టుపడుతున్నారు. కూనంనేని సాంబశివరావు తర్వాత రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కీలక పోస్టులో ఉన్న శ్రీనివాస్‌రావు.. ఉద్యమ ప్రాంతం, వరంగల్ నుంచి పార్టీ నేతలకు పెద్దగా అవకాశాలు రానందున తనకు చాన్స్ ఇవ్వాలని అడిగినట్లు తెలిసింది. సోమవారం టీపీసీసీ చీఫ్‌ను కలిసిన బృందం ... సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను కలవాలనుకున్నా సీఎం ఢిల్లీకి వెళ్లడంతో కుదరలేదు. మంగళవారం సీఎం, ఇతర మంత్రులను ఓ బృందం కలవనుండగా.. ఢిల్లీలో నేడు జరుగుతున్న సీపీఐ జాతీయ సభల్లో పాల్గొనడంతోపాటు కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు మరో బృందం బయలుదేరింది. ఈ బృందంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావుతోపాటు పలువురు ఉన్నారు.

కాంట్రాక్ట్‌లు, ఉద్యోగాలు ఇప్పిస్తానని

వైద్యుడి ఘరానా మోసం

- రూ.5.56 కోట్ల మేర వసూలు
- వివరాలు వెల్లడించిన సీఐ దామోదర్‌రెడ్డి

జనగామ : ప్రభుత్వ ఉద్యోగాలు, బిల్డింగ్ కాంట్రాక్ట్ పనులు ఇప్పిస్తానని రూ. రూ.5.56 కోట్ల మేర వసూలు చేసి మోహం చాటేసిన వైద్యుడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు జనగామ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని కేకే ఆస్పత్రి వైద్యుడు అబ్దుల్ రహీం సుల్తాన్.. రాజ టిప్పుసుల్తాన్ వారసుడితో పాటు ట్రస్ట్ చైర్మన్‌గా ప్రచారం చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు తాను టిప్పు సుల్తాన్ వారసుడినని పరిచయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎండి. వసీం అక్తర్‌తో స్నేహం ఏర్పరుచుకున్నాడు. టిప్పు సుల్తాన్ ట్రస్ట్‌కు కర్ణాటక ప్రభుత్వం నుంచి రూ.7 వందల కోట్లు వస్తున్నాయని, ఇందుకు జీఎస్టీ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందని వసీం అక్తర్‌ను నమ్మించి అతడి వద్ద రూ.1.17 కోట్లు తీసుకున్నాడు. ఇందుకు బహుమానంగా నెలరోజుల్లో జనగామలో తాను నిర్మాణం చేసే మెడికల్ కళాశాల బిల్డింగ్, ఎలక్ట్రికల్ కాంట్రాక్టును ఇప్పిస్తానని చెప్పడంతో వసీం అక్తర్ పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చాడు. 2021లో ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మేకల ఆనంద్ కుమార్ వద్ద రూ.3.75లక్షలు, గాదెపాక రాజ్‌కుమార్ వద్ద రూ. 5.50 లక్షలు, సిద్దార్థ వద్ద రూ.5.50 లక్షలు తీసుకున్నాడు. కేకే ఆస్పత్రిలో ఉన్న ఎక్స్‌రే మిషన్, 10 బెడ్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు, ఇతర మెడికల్ పరికరాలను ఇస్తామని చెప్పి పట్టణానికి చెందిన మారబోయిన పాండు వద్ద 2023లో రూ.5లక్షలు తీసుకున్నాడు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన ఎస్‌వీఎన్ చారి నుంచి రూ.1.70కోట్లు, ఏ.రాజు నుంచి రూ.50లక్షలు, 2014లో కరీంనగర్‌కు చెందిన సీహెచ్ అనిల్ వద్ద రూ.2 కోట్లు తీసుకుని మోసం చేశాడు. మొత్తం రూ.5కోట్ల56లక్షల 75వేల మోసానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఏసీపీ చేతన్ నితిన్ పండరి పర్యవేక్షణలో సదరు వైద్యుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ దామోదర్ రెడ్డి తెలిపారు. లాటరీ, ఉద్యోగాల పేరిట డబ్బులు అడిగితే ఇచ్చి మోసపోవద్దని సీఐ ప్రజలకు సూచించారు.

జాతీయ సమగ్రతను పెంపొందించడమే లక్ష్యం

- నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్‌దాస్



కేరళ యువతకు ప్రశంసపత్రాలు అందిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్‌దాస్

హన్మకొండ: యువతలో జాతీయ సమగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర యువ మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్ దాస్ అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో అంతర్ రాష్ట్ర యువ మార్పిడి కార్యక్రమం–కేరళ ముగింపు కార్యక్రమం జరిగింది. అన్షుమాన్ ప్రసాద్ దాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కేరళ రాష్ట్ర యువతకు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ యువజనుడు సామాజిక సేవా, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. అవినీతి, మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చితంల అన్వేశ్, నేషనల్ యూత్ అవార్డు గ్రహీతలు మండల పరశురాములు, ఆకులపల్లి మధు, నిట్ ప్రొఫెసర్ కోలా ఆనంద్ కిశోర్ పాల్గొన్నారు.

కేయూ పీజీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండు పరీక్ష కేంద్రాల్లో ముగ్గురు కాపీయింగ్ చేస్తూ పట్టుబడగా.. మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. అదేవిధంగా లా మొదటి సెమిస్టర్ పరీక్షల్లో వరంగల్‌లో రెండు పరీక్ష కేంద్రాల్లో కలిపి కాపీయింగ్ చేస్తూ.. స్క్వాడ్‌కు ఆరుగురు పట్టుబడ్డారు. వారిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు తెలిపారు.

పదేళ్ల పాలనలో ఏం చేశారు?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు

- నగర అభివృద్ధికి తట్టెడు మట్టిపోయలే..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- రైతులను రెచ్చగొట్టడం సరికాదు: ఎంపీ కావ్య

హన్మకొండ చౌరస్తా : మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు తీసుకురాకుండా పదేళ్ల పాలనలో ఏం చేశారని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడారు. వరంగల్‌ను డల్లాస్ చేస్తా, ఆక్సిజన్ పార్కు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వంటి హామీలు ఇచ్చిన కేసీఆర్ పదేళ్ల పాలనలో నగర అభివృద్ధికి తట్టెడు మట్టి పోయలేదని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకునే నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయని మండిపడ్డారు. ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యులు, ఉద్యోగుల నియామకం, వైద్యపరికరాల కొరతను పట్టించుకోని నాటి బీఆర్‌ఎస్ సర్కార్, కమీషన్ల కోసం జైలు స్థలం పేపర్లను మహారాష్ట్ర బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.వేల కోట్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. కాజీపేట రైల్వే డివిజన్ హోదా సాధనకు ఈ నెల 9వ తేదీన ఎంపీ కావ్యతో కలిసి ఎమ్మెల్యేలంతా ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రిని కోరనున్నామని తెలిపారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి రూ.6వేల కోట్ల నిధులు మంజూరు చేసిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని వివరించారు. ఎయిర్‌పోర్టు స్థల సేకరణకు రూ.205 కోట్లు మంజూరు చేశారని, స్థల సేకరణలో రైతులను రెచ్చగొట్టేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని, అది సరైంది కాదని ఆమె ధ్వజమెత్తారు. అనంతరం ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, పింగిళి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బుల్లెట్, జావా బైక్‌ల ఢీ.. ముగ్గురి దుర్మరణం

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



సతీశ్(ఫైల్)



రవీందర్‌రెడ్డి (ఫైల్)



నర్సింహారెడ్డి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: బుల్లెట్, జావా బైక్‌లు ఢీకొని ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం రాంపూర్ సమీప అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు,గ్రామస్తులు, ప్రయాణికుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం మీనాజీపేట గ్రామానికి చెందిన పింగిళి రవీందర్‌రెడ్డి (45), కొమ్మిడి నర్సింహారెడ్డి అలియాస్ లడ్డూ (35) భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామ శివారు పెర్కపల్లి బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి మీనాజీపేటకు బుల్లెట్‌పై వస్తున్నారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన నర్సింగోజు సతీశ్ (30) పంబాపూర్‌నుంచి జావా వాహనంపై కమలాపూర్ గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చే క్రమంలో రాంపూర్ గ్రామసమీపం.. మూల మలుపు వద్ద అటవీ ప్రాంతంలో రెండు బైక్‌లు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రగాయాలు కావడంతో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం 108 ద్వారా జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు పింగిళి రవీందర్‌రెడ్డికి భార్య, కుమారుడు, కొమ్మిడి నర్సింహారెడ్డికి భార్య, ఉండగా, నర్సింగోజు సతీశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

వారం క్రితమే సొంతూరుకు వచ్చిన సతీశ్..

సతీశ్ హైదరాబాద్‌లో కుల వృత్తి వడ్రంగి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులను కలిసేందుకు వారం రోజుల క్రితం భార్యాపిల్లలతో కలిసి తన సొంత గ్రామం పంబాపూర్‌కు వచ్చాడు. ముగ్గురి మృతితో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వేసవి పనులు త్వరగా పూర్తి చేయాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరుణ్ రెడ్డి

హన్మకొండ : వేసవి ప్రణాళికలో భాగంగా మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల (జిల్లాలు) ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్లు, జిల్లాల వారీగా వేసవి ప్రణాళిక, ఇతర అంశాలపై సమీక్షించారు. సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ వేసవి ప్రణాళికలో భాగంగా మిగిలిపోయిన ఇంటర్ లింకింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి, ఏప్రిల్ పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా జరిగేలా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌ల మంజూరులో జాప్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు, సరీసృపాల వల్ల షార్ట్ సర్క్యూట్ కాకుండా మోనోప్లాస్ట్‌లు పెట్టాలన్నారు. దీని ద్వారా చాలా వరకు అంతరాయాలను నివారించొచ్చన్నారు. యూనిక్ పోల్ నంబర్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఓల్టేజీని మరింత మెరుగుపరచడానికి లైన్లలో కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, బీకంసింగ్, వెంకటరమణ, జీఎంలు అన్నపూర్ణ, నాగ ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, మల్లికార్జున్, కృష్ణ మోహన్, వేణు బాబు, డీఈ అనిల్‌కుమార్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన అప్పులు..

- మహిళా కౌలు రైతు, ట్రాక్టర్ యజమాని బలవన్మరణం
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు

అప్పులు, ఆర్థిక బాధలు భరించలేక ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. పంట, ట్రాక్టర్ కొనుగోలు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ మహిళా కౌలు రైతు, ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



లక్ష్మి(ఫైల్)

దుగ్గొండి: పంట సరిగా పండక.. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక.. తెచ్చిన అప్పు తీర్చలేక ఓ మహిళా కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని మహ్మదాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం లక్ష్మి(52), మొగిలి దంపతులు 5 సంవత్సరాలుగా ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అయితే పంట సరిగా పండక.. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక.. పెట్టుబడి అప్పు రూ.. 5లక్షలకు పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలని దంపతులు నిత్యం మదనపడుతుండేవారు. దీనికి తోడు మొగిలి గొర్రెలు, బర్రెల వ్యాపారం చేస్తూ నష్టాల పాలయ్యాడు.ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా వారు వేర్వేరుగా ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉండడంతో కలత చెందిన లక్ష్మి గత నెల 27న సాయంత్రం పురుగుల మందు తాగింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన మొగిలికి భార్య పడుకుని ఉండి మంచం వద్ద పురుగుల మందు డబ్బా ఉండడంతో వెంటనే ఎంజీఎంకు తీసుకెళ్లాడు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. భర్త మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ట్రాక్టర్ అప్పు తీర్చలేక ఉయ్యాలవాడలో యువకుడు..



సాయి మృతదేహం

డోర్నకల్: ట్రాక్టర్ కొనుగోలు కోసం చేసిన అప్పు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఉయ్యాలవాడలో చోటుచేసుకుంది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోటు సాయి(31) అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో ట్రాక్టర్ అప్పు సకాలంలో చెల్లించలేకపోవడంతోపాటు ఇతర అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురై ఈ నెల 1వ తేదీన గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాయిని గుర్తించిన కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సాయికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సాయిసింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తనవాటా భూమి దక్కడం లేదని దామెరలో యువకుడు..



నాగరాజు(ఫైల్)

దామెర: తన వాటా భూమి దక్కడంలేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన పున్నం నాగరాజు(36) తనకు వారసత్వంగా రావాల్సిన ఎకరం భూమిని తన సొంత అక్క ఉమారాణితోపాటు చిన్నమ్మ కుమారులు రామకృష్ణ, పూర్ణచందర్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో నాగరాజు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ సమయంలో నాగరాజుకు భూమి ఇస్తామని ఒప్పుకుని తర్వాత ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు.. జనవరి 24న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. నాగరాజు భార్య మమత ఫిర్యాదు మేరకు ఉమారాణి, రామకృష్ణ, నార్లగిరి పూర్ణచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.